వైద్యుల కొరత.. రోగులకు వ్యథ

- అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద రోగుల ఇబ్బందులు
- ఆసుపత్రిని వదిలి.. సర్వేల కోసం పరుగులు



అర్బన్‌హెల్త్ సెంటరులో డాక్టర్ కోసం వేచి ఉన్న రోగులు

పెడన: పట్టణంలో సుమారు 30వేల మంది జనాభా కోసం ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటరులో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి వరకు విధులు నిర్వహించిన డాక్టర్ సాయిప్రీతి పీజీ కోసం రిజైన్ చేసి వెళ్లిపోయారు. దీంతో గూడూరు మండలంలో విధులు నిర్వహించే హిమపద్మజకు ఇంఛార్జి బాధ్యతలను అప్పగించారు. ఎన్‌సీడీసీ సర్వే కోసం డాక్టర్ హిమపద్మజ కూడా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రోగులు వైద్యురాలు తిరిగి వచ్చేంత వరకు పడిగాపులు కాస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ఆసుపత్రి నిర్మాణం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. కోటి పెట్టి ఆసుపత్రిని నిర్మించి అన్ని పరికరాలు, సౌకర్యాలు కల్పించారు. విద్యుత్ సరఫరాకు త్రీఫేజ్ కరెంట్ కోసం మరో రెండు, మూడు లక్షలు వెచ్చించి నివేదికలు పంపించారు. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆసుపత్రిలో సౌకర్యాలు దేవుడెరుగు, రోగులను సక్రమంగా చూసే వైద్యులను కూడా సర్వేలు చేయడానికి కేటాయిస్తున్నారు. దీంతో ఎన్డీయే కూటమిలోని ఉన్నతాధికారులు వైద్యులపై వత్తిడి తెస్తుండటంతో రోగులను సక్రమంగా చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయం 9 గంటలకు వచ్చా



ఆయాసంగా ఉందని చూపించుకోవడానికి ఉదయం 9 గంటలకు వచ్చా. డాక్టరమ్మా హడావుడిగా వెళ్లిపోతున్నారు. ఎప్పుడు వస్తారోనని ఆసుపత్రి ముందు ఎదురుచూస్తున్నా. ఆమె తప్ప ఎవరూ ఇక్కడ చూడరు. వేరే ఎక్కడికైనా వెళదామంటే చాలా దూరం పోవాలి. అందుకే ఇక్కడకు వచ్చి చూపించుకుంటున్నా. **భట్టు మల్లేశ్వరరావు, 20వ వార్డు, పెడన**

మంచి వైద్య సేవలు అందిస్తా

గూడూరు మండలం మల్లవోలు పీహెచ్‌సీలో ఉంటా. గూడూరు మండలంలో రెగ్యులర్ వైద్యురాలిని. ఇక్కడకు ఇంఛార్జిగా నియమించారు. ఎన్ని రోజులు అని కూడా చెప్పలేదు. కొత్తవారు వచ్చే వరకు బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పుడిప్పుడే ఇక్కడ పరిస్థితులు అవగాహన చేసుకుంటున్నా. రోగులు మెచ్చుకునేలా నా సేవలను అందిస్తా. **హిమపద్మజ, ఇంఛార్జి వైద్యురాలు, అర్బన్ హెల్త్ సెంటరు, పెడన**

ఆకట్టుకుంటున్న పాఠశాల గోడలపై చిత్రాలు



ఆకర్షణీయంగా గోడలపై వేసిన చిత్రాలు

మచిలీపట్నంటౌన్: పాఠశాల గోడలు విద్యార్థులకు పాఠాలు నేర్పుతాయని ఆ విధంగా పాఠశాల ఆర్ట్ ఉపాధ్యాయుడు రెహాన్ సైఫీ విద్యార్థులతో కలిసి కుడ్య చిత్రాలను రూపొందించారని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసీఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక విద్యాలయంలో పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా రేహాన్ సైఫీ గోడలపై రూపొందించిన చిత్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ చిత్రాల ద్వారా విద్యార్థుల బోధన, అభ్యసన ప్రక్రియ మరింత మెరుగవుతుందన్నారు. అలాగే పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటం వల్ల మంచిగా విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. అంతేకాకుండా గణితం, సామాన్య శాస్త్రం, ఆత్మరక్షణ విద్య, రోబోటిక్స్ తదితర అంశాలపై రెహాన్ విద్యార్థులను చైతన్యపరిచి మంచి చిత్రాలు గీసేలా మార్గదర్శకత్వం వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత

జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు



ఆముదాలపల్లిలో నీటిలో క్లోరిన్ శాతం పరిశీలిస్తున్న సీఈఓ కన్నమనాయుడు

బంటుమిల్లి: ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 42 రక్షిత మంచినీటి పథకాలకు జిల్లా పరిషత్ గ్రాంటు నుంచి ఏడాదికి రూ.25కోట్ల నుంచి 30 కోట్లు ఖర్చు చేసి తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ సీఈఓ కే కన్నమనాయుడు అన్నారు. మండలంలోని చోరంపూడి, ఆముదాలపల్లి సీపీడబ్ల్యూ పథకాలను గురువారం ఆయన సందర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా జిల్లా పరిషత్ జనరల్ నిధులు, 15వ ఆర్థిక సంఘ నిధులతో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జెడ్పీతో పాటు మండల పరిషత్, గ్రామ పంచాయితీలు సమన్వయంతో తాగునీటి సమస్య పరిష్కారానికే తొలి ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. చోరంపూడి పథకం పరిధిలోని మల్లంపూడి గ్రామంలో సంపు నిర్మాణానికి రూ. 3 లక్షలు కేటాయించామని తెలిపారు. అలాగే ఆముదాలపల్లి పథకంలో భాగంగా ఉన్న చెరువుకు ఫెన్సింగ్ వేసేందుకు అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజకుమారి, పీఆర్‌ఏఈఈ నగేష్‌లు పాల్గొన్నారు.

అక్రమ కుళాయిలు తొలగించండి

గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అక్రమ కుళాయిలు తొలగించి పూర్తి స్థాయిలో అందరికి తాగునీరు ఇవ్వడానికి కృషి చేయాలని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ సీఈఓ కే కన్నమనాయుడు పేర్కొన్నారు. రక్షిత మంచినీటి పథకంలో భాగంగా ఉన్న మైక్రో ఫిల్టరును, స్టోరేజి చెరువును, ఇసుక ఫిల్టర్లను ఆయన పరిశీలించారు. మైక్రోఫిల్టర్ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో ఎంత శాతం క్లోరిన్ కలుస్తున్నది పరిశీలించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల వాక్ అవుట్ సమ్మె



వాక్ అవుట్ సమ్మెలో ఎల్ఐసీ ఉద్యోగులు

మచిలీపట్నంటౌన్: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం ఉద్యోగులు గంట పాటు వాక్ అవుట్ సమ్మెను నిర్వహించారు. ఎల్ఐసీలో క్లాస్ 3, 4 ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చెయ్యాలని, యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలని కోరుతూ ఆల్ ఇండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్(ఐసీఈయూ) ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు వాక్ అవుట్ సమ్మెను చేశారు. ఈ సందర్భంగా ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ శాఖ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్‌లైన రిక్రూట్మెంట్, యూనియన్ గుర్తింపుపై అనేకసార్లు యాజమాన్యం, ప్రభుత్వానికి విన్నవించామని, ఫలితం లేకపోవడంతో సమ్మె చేయవలసి వచ్చిందన్నారు. యూనియన్ నాయకులు జే సుధాకర్, వాసు, రాజశేఖర్, ఏ శ్రీనివాసరావు, బీ శ్రీనివాస్, వై స్వామినాథ్, యు రామాంజనేయులు, రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు బీహెచ్‌వీఎల్ రాధాకృష్ణమూర్తి, సీహెచ్ బ్రహ్మయ్య, పీ నాగయ్య పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో న్యాయసేవలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య

గూడూరు: పేదలకు అందుబాటులో న్యాయసేవలు అందేలా న్యాయసాధికార సంస్థ పనిచేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ సోషల్ జస్టిస్‌ను పురస్కరించుకుని గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను ఇంటింటా ప్రచారం చేయాలని కోరారు. ఉచిత న్యాయ సేవల కోసం టోల్ ఫ్రీ నెంబరు 15100కు కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. 3జీ, 4జీ, 5జీలు ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో ప్రభావితం కావాల్సిన అసలైన జీ – గురువు బోధనలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణి దూర్జటి, ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయని డి.పుష్పలత, ఎస్‌ఐ కేఎన్‌వీ సత్యనారాయణ, న్యాయవాది ముసలయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంగలూరులో కలెక్టర్ బాలాజీ ఆకస్మిక పర్యటన

గుడ్లవల్లేరు: అంగలూరులో జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఆకస్మికంగా మార్గ మధ్యంలో గురువారం సాయంత్రం కారు దిగి, ప్రధాన రహదారి వెంబడి నడుస్తూ గ్రామాన్ని పరిశీలించారు. ఇంటింటికీ కాలి నడకన వెళ్లి మహిళలతో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్తను గ్రామ పంచాయతీ వారు విడి విడిగా సేకరిస్తున్నారా? లేదా అని విచారించారు. విడి విడిగానే చేస్తున్నారని మహిళలు సమాధానం ఇచ్చారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ టి.విజయ సారథి, తహసీల్దార్ బి.లోకరాజు, కార్యదర్శి ఎలీషారావు, వీఆర్వో లక్ష్మయ్య, సిబ్బంది ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

మచిలీపట్నంటౌన్: క్షయ వ్యాధి లక్షణాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మచిలీపట్నం టీబీ యూనిట్ హెల్త్ విజిటర్ కేవీపీ ప్రసాద్‌బాబు అన్నారు. క్షయ నివారణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఫ్లోరా పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు రావడం, సాయంత్రం సమయంలో జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి మదగించడం, దగ్గుతోపాటు రక్తం పడే లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి సోకినట్లుగా గుర్తించాలని వివరించారు. క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను స్థానిక జీజీహెచ్‌లో ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయ్యాక రోగికి ఆరు నెలల పాటు మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజని, విద్యార్థులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం



చల్లపల్లి: చల్లపల్లిలోని శ్రీ వరదా వెంకట రామలింగియ్య మండల పరిషత్ పాఠశాలకు పూర్వ విద్యార్థి చొరవతో మరుగుదొడ్లు, ఆవరణకు గ్రిల్ సమకూరాయి. చల్లపల్లికి చెందిన తోట రవిచంద్ర ఇక్కడి పాఠశాలలో చదువుకుని ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లాలో కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్నారు. అయితే తాను చదువుకున్న స్కూలు తనవంతుగా కెనరా బ్యాంకు సౌజన్యంతో రూ.1.50లక్షలతో మరుగుదొడ్లు, గ్రిల్ నిర్మించి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు, చల్లపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ పవన్‌కుమార్, హెచ్‌ఎం సూర్యదేవర పద్మజ, ఉపాధ్యాయులు మహ్మద్ షాహీనాలు పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశం పరిశీలన



పెదకళ్లేపల్లి(మోపిదేవి): మహాశివరాత్రి సందర్భంగా పెదకళ్లేపల్లి తరలివచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని చల్లపల్లి సీఐ ఈశ్వరరావుతో కలిసి దేవస్థానం డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు గురువారం పరిశీలించారు. శివరాత్రి మహోత్సవాలు ఈనెల 23 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వేల సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం వాహనాల పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కృష్ణానది వద్ద కరకట్ట సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఉన్న ముళ్లకంపను తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఐ సత్యనారాయణ, అరజా కిరణ్‌కాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులే కృష్ణా మిల్క్ యూనియన్‌కు వెన్నుముక



దేవరకోట(ఘంటసాల): పాడి రైతులే కృష్ణా మిల్క్ యూనియన్‌కు వెన్నుముక అని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట పాలకేంద్రం వద్ద యూనియన్ 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకేంద్రం ప్రెసిడెంట్ వేమూరి రత్నగిరిరావు అధ్యక్షతన గురువారం వజ్రోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ పాడి పరిశ్రమను కృష్ణా మిల్క్ యూనియన్ బాధ్యతగా నిర్వహిస్తూ పాడి రైతులకు అండగా నిలుస్తోందని, భవిష్యత్తులో పాల ఉత్పత్తిని పెంచాలని సూచించారు. అనంతరం పాడి రైతులు, అధ్యక్షులను చలసాని దుశ్శాలువాలతో సత్కరించగా, ఛైర్మన్ చలసానిని పాలకేంద్రం తరుపున సన్మానించారు. మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్, సూపర్ వైజర్ తమ్మన సురేష్ కుమార్, వేతన కార్యదర్శి తుమ్మల వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల వెడల్పుపై అభ్యంతరాలు తెలియజేయండి

మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు



సర్క్యులేషన్ ప్యాటర్న్‌ను విడుదల చేస్తున్న కమిషనర్ గోపాలరావు తదితరులు

పెడన: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న అంతర్గత రోడ్లు వెడల్పు చేసే పరిస్థితి లేకపోవడంతో వాటిని అలాగే ఉంచడం జరుగుతుందని, దీనిని మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచడానికి స్థానికుల నుంచి ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం పెడన పురపాలక సంఘం పరిధిలోని తామర చెరువు, హరిజనవాడ ప్రాంతం, వీరభద్రపురం ప్రాంతం, చెంచులు కాలనీ ప్రాంతం, మంగళవారి స్ట్రీట్, ఇందిరాకాలనీ ప్రాంతాలకు సంబంధించి సర్క్యులేషన్ ప్యాటర్న్ అప్రూవల్ చేసిన నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో రోడ్ల విస్తీర్ణ ఇక ఉండదని, ఉన్నదానినే ప్లాన్‌లో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. అభ్యంతరాలను నేరుగా లేదా రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఎంసీ.పెడన.సీడీఎంఏ.జీవోవీ.ఐఎన్ మెయిల్ ద్వారా వారం రోజుల్లోగా తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీవో సుజన కుమారి, టౌన్ సర్వేయర్ నాగరాజు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు జితేంద్ర, కిరణ్, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూరగాయలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తాం

మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం



కోసూరువారిపాలెంలో టమాటా పంటను పరిశీలిస్తున్న ఏడీ నిత్యానందం తదితరులు

కోసూరువారిపాలెం(మోపిదేవి): రైతులు పండించిన కూరగాయలకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం తెలిపారు. మండలంలోని కోసూరువారిపాలెం, మెరకనపల్లి గ్రామాల్లో టమాటా పంటలను ఉద్యానశాఖ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ మండలంలో సుమారు 120 ఎకరాల్లో టమాటా సాగు చేసినట్లు తెలిపారు. టమాటా ఒకేరోజు కాకుండా రోజు విడిచి రోజు కోత చేపడితే మచిలీపట్నం రైతు బజారులో మార్కెట్ కల్పిస్తామని రైతులకు తెలిపారు. ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, వారి సమస్యను దృష్టిలో పెట్టుకుని రైతు బజారులో అమ్మకాలకు మార్కెట్ కల్పిస్తామని వివరించారు. దివిసీమలో వాణిజ్య, కూరగాయల పంటలు అత్యధికంగా మోపిదేవి మండలంలోనే పండిస్తారని నష్టాన బారిన పడిన రైతులను ఆదుకోవాలని కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు అధికారులను కోరారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఉద్యానశాఖ అధికారి ఎస్. రమేష్, సచివాలయ ఉద్యాన అధికారి శ్రీజ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ–2 హరనాథ్

పెడన: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న మొదటి విడత శిక్షణ గురువారంతో ముగిసింది. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ–2 వైవీ హరనాథ్ అంగన్‌వాడీల్లో పిల్లల సమగ్ర అభివృద్ధిని పెంపొందించే వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. చిన్నారులను ఆకట్టుకునేలా నడుచుకోవాలని సూచించారు. సీడీపీవో సముద్రవేణి మాట్లాడుతూ శిశు సంరక్షణ, విద్య, నూతన విద్యా విధానం, శిశువుల మెదడుపై ప్రభావితం చేసే అంశాలు, శారీరక భాష, మేధాభివృద్ధి కృత్యాలు వంటి తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చామన్నారు. వాటిని సక్రమంగా వినియోగిస్తూ చిన్నారులను ఆకట్టుకునేలా నడుచుకోవాలని హితవు పలికారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు తయారు చేసిన బోధన అభ్యసన సామగ్రిని పరిశీలించారు. సూపర్‌వైజర్లు కల్పవల్లి, శ్రావణి కుమారి, రిసోర్స్ పర్సన్‌లు హనుమంతరావు, శ్రీమన్నారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

23న విగ్రహాల ప్రతిష్ఠ



తిరుమల తిరుపతి నుంచి వచ్చిన దేవతామూర్తుల విగ్రహాలు

చల్లపల్లి: చల్లపల్లి పడమరవీధిలోని జెండాస్తంభం వద్ద నూతనంగా పునఃనిర్మాణం చేసిన శ్రీ రాఘవరపు వెంకటకృష్ణమ్మ జానకి రామాలయంలో ఈ నెల 23వ తేదీన శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ మూర్తులు తిరుమల తిరుపతి దేవస్థానం శిల్పకళ నుంచి గురువారం రాగా వాటిని ఊరేగింపుగా తీసుకువచ్చి పడమరవీధిలోని మరో రామాలయం(తాళ్ల రామాలయం)లో ఉంచారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రతిష్ఠా మహోత్సవాలకు సంబంధించిన వైదిక కార్యక్రమాలను మంత్రాలయంకు చెందిన బ్రహ్మశ్రీ డాక్టర్ కనుమళ్ల రామకృష్ణ శాస్త్రి, తిరుపతికి చెందిన బ్రహ్మశ్రీ రూపరాజు విజయ్ కుమార్ శర్మల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరుగుతాయని తెలిపారు. ప్రతిష్ఠా ఉత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

కొనసాగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు



గూడూరులో శిక్షణ తరగతులలో అంగన్‌వాడీ కార్యకర్తలు

ఘంటసాల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆరోగ్య, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందించాలని ఐసీడీఎస్ ఘంటసాల, శ్రీకాకుళం సెక్టార్ల సూపర్ వైజర్లు టి.రమానాగమణి, డి.మేరీ సూచించారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా రిసోర్స్ పర్సన్‌లు నాగబాబు, రామకృష్ణ, కొల్లూరి మోహనవంశీలు కార్యకర్తలకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చి ప్రయోగాత్మకంగా అంగన్‌వాడీలతో చేయించారు. ఘంటసాల, శ్రీకాకుళం సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడవ రోజుకు శిక్షణ తరగతులు

గూడూరు: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం మూడవ రోజుకు చేరాయి. ఆరు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను మూడు రోజులు చెప్పున రెండు విడతల్లో నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జన్ను రేవతి తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు

అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీలో రేగుల్లంక, పాతకోటకు వెళ్లే పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. ఈ ప్రాంతంలో వాటర్ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో స్పందించిన సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్ గురువారం సిబ్బందితో మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాని పునరుద్ధించారు.

క్లుప్తంగా

పోలింగ్‌లో పాల్గొనేలా చర్యలు చేపట్టండి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 27వ తేదీన జరిగే కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనేందుకు ఆయా సంస్థల ఉద్యోగులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియలో ప్రైవేటు మేనేజ్‌మెంట్, వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంస్థల యాజమాన్యాలు పోలింగ్‌లో పాల్గొనేలా విధులకు హాజరుకావడంలో వెసులుబాటు, షిఫ్టల సర్దుబాటు తదితర ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు.

కుళాయి పైపునకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో కుళాయి పైపునకు మరమ్మతులు చేశారు. పైప్ ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తున్నారని ఆర్డీవో స్వాతికి ఇటీవల కోసూరు రామాంజనేయులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని సాక్షి దినపత్రిక ఈనెల 20వ తేదీ 'కుళాయిల్లో మురుగునీరు సరఫరా' అనే కథనం ప్రచురించింది. స్పందించిన పంచాయతీ అధికారులు గురువారం కుళాయి పైపునకు మరమ్మతులు చేశారు. మురుగునీటి నుంచి విముక్తి కలిగించిన పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో స్వర్ణభారతికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం



చల్లపల్లి: పాగోలు కై వల్యాశ్రమంలో గురువారం సహస్ర ఘటాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాసాగర్‌స్వామి పర్యవేక్షణలో బ్రహ్మర్షులు వడ్లమూడి సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమూడి కేదారశర్మ ఆధ్వర్యంలో 108 కలశ ఘటాలను ఏర్పాటుచేసి పూజలు చేశారు. ఆశ్రమ ట్రస్టీ మేకా సత్యనారాయణ ప్రసాద్ దంపతులు, మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చెత్త సేకరణ పరిశీలన



ఘంటసాలపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం ఘంటసాలపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల పనితీరును గురువారం ఈఓపీఆర్డీ కే వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తడి–పొడి చెత్తను వేరు వేరుగా చేసి ఇళ్ల ముందుకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని కోరారు. సేకరించిన తడి–పొడి చెత్తను ఆయా గ్రామాల్లోని చెత్త నుంచి సంపద కేంద్రాలకు తీసుకెళ్లి తొట్టిల్లో వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. కావునా మండలంలోని ప్రజలంతా గ్రీన్ అంబాసిడర్లకు సహకరించాలని కోరారు. విధులు సమర్ధవంతంగా నిర్వహిస్తున్న ఈఓలు అర్జునరావు, శ్రీలక్ష్మీకృష్ణవేణి, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రలను ఈఓపీఆర్డీ అభినందించారు.

వర్మీ కంపోస్టుతో అధిక దిగుబడులు



చల్లపల్లి: పెరట్లోని, పంట పొలాల్లోని మొక్కలకు వర్మీ కంపోస్టు వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని చల్లపల్లి ఎంపీడీఓ ఎ. వెంకటరమణ అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురం వారపు సంతలో గురువారం ఎంపీడీఓతో పాటు ఈఓపీఆర్డీ వి. రవిశంకర్, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రరావు వర్మీ కంపోస్టు సేల్ పాయింట్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారుల సూచన మేరకు స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చల్లపల్లిలోని సంపద తయారీ కేంద్రం నుంచి ఈ వర్మీ కంపోస్టును తెచ్చి ఇక్కడ అమ్ముతున్నట్లు వివరించారు. ప్రజలు, రైతులు ఈ వర్మీ కంపోస్టును మొక్కలకు వాడి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. వచ్చే సోమవారం చల్లపల్లి వారపు సంతలో కూడా వర్మీ కంపోస్టు సేల్ పాయింట్ ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు.